# శత ప్రవేశ పరీక్షా విధానం

## ఉపోద్ఘాతం :

ఇప్పుడన్నింటికి ఎన్‌ట్రెన్స్ ఎగ్జామినేషన్స్ వచ్చి దేశం మీద పడ్డాయి. వాళ్ళు పెట్టారని వీళ్ళు, వాళ్ళు, వీళ్ళు మాత్రమేనా, మేమూ పెట్టగలం అని మరొకళ్ళు పెడ్తూ పోతున్నారు. ఎందుకు పెడ్తున్నారు? పంజాబ్‌లో రావుకి, ఆంధ్రాలో రావుకి ఇంటర్, (పి.యు.సి.)లో 80 శాతం వచ్చిందనుకోండి. ఇద్దరూ ఒక్కలా తెలివైనవారు అనుకోవచ్చా? కోరాదు?

వాళ్ళ మార్కులు, ఉప్పుకప్పురాలలాగా ఒక్క పోలికనున్నా వాటి క్వాలిటీ వేరు కనుక. అంటే ఒక 80 మరో 80 కంటే గొప్పది! ఏది గొప్పదన్నది మీమీ పక్షపాతాల ననుసరించి వుంటుంది. కాని రెండూ సరిసమానం కావన్న విషయంలో ఏకాభిప్రాయం ఉంది మీ అందరికి.

అయితే కొందరు "అయ్యా నేను మన యూనివర్శిటీలోనే బియ్యే పాసయ్యాను. అప్పారావూ కూడా ఇక్కడే చదివాడు. నాకు అతడి కంటే ఎక్కువ మార్కులు వచ్చాయి. ఎందులో? మీరు పెట్టిన పరీక్షల్లోనే. వేరే వాళ్ళు పెట్టిన వాట్లో కాదు! ఇక్కడ మేము ఎమ్మే జేర్తామంటే మళ్ళీ ఈ పరీక్షల గొడవేమిటి మహాప్రభో" అంటే దానికి సమాధానం తెలియదు.

"మన ఉద్యోగానికి కావలసిన "గుణం" అభ్యర్థికి ఉందో లేదో తెలుసుకోడానికి, అంతకు ముందు మరెవరో పెట్టిన పరీక్షల్లో వచ్చిన మార్కులు ఉపకరించవు. మనమే ఓ పరీక్ష పెట్టి తేలుద్దాం" అన్నది మరో అభిప్రాయం. అయితే మరోళ్ళు ఇరవై పరీక్షలు పెట్టి తేల్చలేని విషయం మనం ఒక పరీక్షతోనో, రెండింటితోనో తేల్చగలమా? అన్నది అనుమానం పరీక్షా విధానం మారకపోతే అన్ని పరీక్షలు చూడ్డానికి నీరు, మంచులా తేడాగా కనిపిస్తున్నా సూక్ష్మంగా ఒక లాంటివే! ఒకలాంటి లోటు పాట్లు కలవే కదా!

పూర్వం విద్యార్థులు సీటు రావడానికి అప్లికేషన్‌కి అయిదో, పదో ముడుపు గట్టి పంపి ఫలితాల కోసం ఎదురు చూస్తూ కూర్చునేవారు. ఇప్పుడే ఎంట్రన్స్ ఎగ్జామినేషన్స్ వ్రాయటం

కోసం సెంటర్ నుంచి సెంటర్‌కి పరిగెడ్తున్నారు. అటువంటి సుబ్బారావు కథ ఇది. అతనికి బోలెడు వ్యయం, శ్రమ. మధ్య తరగతి సుబ్బారావులీ పరీక్షా విధానాల్తో చిక్కి శల్యమౌతున్నారు. ఈ పరీక్షలకి ట్రెయినింగ్ లిచ్చే సంస్థల సాలెగూళ్ళల్లో ఇరుక్కుంటున్నారు. ఖర్చైపోతున్నారు!

★

# కథా ప్రారంభం

పాపని నిద్రబుచ్చి మణి వీధిలో పరుచుకొన్న వెన్నెల్లోకి చల్లగా పిల్లగాలిలా వచ్చింది. అక్కడ గోపాల్రావ్ ఓ కుర్చీలో కూర్చుని, ఎదురు కుర్చీలో కాళ్ళు జాపుకొని పైపు కాల్చుకొంటున్నాడు. సీతమ్మవారు హరుని విల్లునెత్తినంత సులువుగా మణి గోపాల్రావ్ కాళ్ళను తన ఎడంచేత్తో ఎత్తి ఆ చోట్లో తను కూర్చుని, తన వళ్ళో ఆ చరణ పద్మాలను వుంచుకొని తన కరకమలాలతో రాయటం మొదలు పెట్టింది. గోపాల్రావ్ కంగారు పడ్డాడు. పడి మణి మొహంలోకి చూశాడు గోపాల్రావ్. వెనకాతల దాక్కున్న చంద్రుడు మణి ముఖంలో ప్రతిఫలించి వెలిగి పోయాడు. ఆమె కళ్ళల్లో కోటి దీపాలయి వెలిగాడు. మామూలుగా గోపాల్రావ్ పరవశించిపోవాల్సిన తరుణం అది. మణి ఎత్తిన తన కాళ్ళను గురుత్వాకర్షణ శక్తి ప్రభావానికి వదిలిపెట్టి దభీమని నేల మీద పడేస్తుందని ఊహించాడు. కాని మణి సాధారణ సినీ పతివ్రతలాగా తన కాళ్ళను పూజిస్తుంటే భయపడ్డాడు.

"ఏం కావాలి మణీ?" అని తిన్నగా అడిగాడు గోపాల్రావ్ భార్యని.

మణి చక్కగా నవ్వింది. ముత్యాలు దొర్లాయి.

"నా పిచ్చి గోపీ!" అంది నాందిగా,

"నా గోపీ అని పిలువు చాలు. విశేషణాలు అక్కర్లేదు."

"అలాగే! నా గోపీ! అయామ్ హాపీ! మనం మన ఊరెళ్తున్నాంట!"

"నీకు అలా ఎవరు చెప్పారు?"

"మా నాన్న"

"మీ నాన్నకెవరు చెప్పారు?"

"డాక్టర్ గాలం"

"మీ నాన్న ఢిల్లీ నుంచి రైల్దిగిందివాళే కదా' అప్పుడే మా ఆఫీసుని చుట్టబెట్టడం, రాజుగార్ని కలవటం. నా ప్రయాణపు భోగట్టా ఆరా తియ్యడం చేసేశాడా?" అన్నాడు గోపాల్రావ్ ఆశ్చర్యంగా.

ఆ పొద్దున గాలం రామరాజు తనని పిల్చి "మద్రాను వెళ్ళిరావాలి" అని ఆజ్ఞాపించాడు. తను సరేనన్నాడు. మద్రాసు వెళ్ళాంటే ఆంధ్రా మీదుగా వెళ్ళక తప్పదు కదా! అందుకని మణి,

ఆమెను తను తీసుకు వెళ్తున్నట్లు, తాము ఆంధ్రాలో జర్నీ బ్రేక్ చేస్తున్నట్లు ఊహించింది. మణి ఏదో చెప్పబోతున్నంతలో -

"శత ప్రవేశ పరీక్షావధాని జోషీకి జై" అన్న కేకల్తో దిక్కులు పిక్కటిల్లాయి.

"ఏమిటో ఆ ఊరేగింపు" అనుకొన్నారు, భార్యాభర్తలు.

"అబ్బే ఏం లేదురా గోపన్నా! పై చదువులు, ఓ రకం ఉద్యోగాలు కావాలనుకునే వోళ్ళకి పరీచ్చలుంటాయంటగా - ఆ అబ్బాయి చాకులా ఉన్నాడులే. ఇందాక రాజు గారి బజార్లో ఈ ఊరేగింపు అటుగా వచ్చినప్పుడు చూశా. అబ్బాయి అట్లాంటి పరీచ్చలు నిన్నట్తో ఓ నూరు పూర్తి చేశాడంట. చాలా మంది అందులో సగం రాసేతలికే మతి చెడిపోతారట కదా! అందుకని పదులు, పాతికలు మాత్తరమ్ రాసిన కుఱ్ఱకారంతా అతన్నో ఎన్టీ రామారావుని చేసేసి అభిమానంతో ఊరేగిస్తున్నారు" అన్నాడు సిద్దయ్య. అతను గోపన్న అని పిలపబడ్డ గోపాల్రావ్‌కి మేనమామ. మణి అనే పిల్లదానికి కన్నతండ్రి.

ఊరేగింపు కేకలకి పడుకొన్న పసిది లేచి గుక్కపట్టింది. మణి లోపలికి వెళ్ళింది. ఖాళీ అయిన కుర్చీలో సిద్దయ్య కూర్చున్నాడు.

"నూరు పరీక్షలే!" అని ఆశ్చర్య పోయాడు గోపన్న.

"మరే. బళ్ళో సంవచ్చరం సంవచ్చరం వెళ్ళేవి కాకుండా ఇవి ఎగ్రస్ట్రాట" అన్నాడు సిద్దయ్య.

"ఎవరు చెప్పారు?" అని కుతూహలంగా అడిగాడు గోపన్న.

మణి పాపను భూజాన వేసుకొని వచ్చి మెట్ల మీద కూర్చుంది.

"అదంతా ఓ పెద్ద కతలే" అన్నాడు సిద్దయ్య మణి కేసి చూసి.

"చెప్పు" అని అడిగాడు గోపన్న.

ఖద్దరు లాల్చీ జేబులోంచి సిద్దయ్య ఓ పొగాకు కాడ పైకి లాగి దాన్ని మధ్యకు చీల్చి పొడుగ్గా చుట్ట చుట్టి, దాన్ని రెండు చేతుల మధ్యా పెట్టి దొర్లించి, ఒక చివర కొరికి రెండో చివర ముట్టించి మొదలు పెట్టాడు.

"ఇందాక రాజుగార్నడిగితే ఆయన్చెప్పాడు. తీగ లాగితే డొంక కదిలినట్లు ఆయనెక్కడో మొదలెట్టి ఏటో గందర గోళంగా చెపాచ్చాడు కత. నాకు సరిగ్గా అర్థమై చావలా! ఒకపాలి మనకి రైల్లో కలిశాడే ఓ ఆయన. మంచి నిండైన విగ్రహం. ఆయన పేరేమిటబ్బా."

"డాక్టర్ మూఢేశ్వర్ జూనియర్. వాళ్ళ నాన్న కేంద్రంలో మంత్రి" అని గోపన్న అందించాడు.

"ఈ చిన్న మూఢేశ్వరయ్య అమెరికాలో చదువుకొన్నాడంట. అక్కడ ఎ, బి. సి. డి, ఇ. ఎఫ్, ఎమ్, జి, ఆర్, ఇ లాంటి పరీచ్చలున్నాయంటగా! అవి చూసొచ్చి మన్దేశంలో కూడా అట్టాంటి వుంటే లచ్చనంగా వుంటుందని ఆలోచించి తండ్రికి చెప్పాడంట. ఆయనేమో వెంటనే కేంద్రం నడిపే అయ్యి అయ్యి టీల్లో ఈ పరీచ్చ లెట్టేశాడంట. మళ్ళీ ఇట్టాంటి బళ్ళే మరి కొన్నింటికి కూడా ఈ పరీచ్చ లేర్పాటు చేశాడంట. అది క్రమేపీ ప్రాంతీయ కాలేజీలకి,

యూనివర్శిటీలకి, ఆఖరికి ప్రైవేటు కాలేజీలకి కూడా పాకి పోయిందట'' సిద్ధయ్య ఎఫెక్టు కోసం ఆగాడు.

"ప్రైవేటు కాలేజీలక్కూడానా?'' గోపన్న ఆశ్చర్యంగా అడిగాడు.

"మరే! ఆ కాలేజీలు పెట్టుకొన్నదెందుకు? డబ్బుండి సదువురాని కుర్రాళ్ళ కోసం కదా! తెలివైనవోళ్ళకి ప్రభుత్వం ఎట్టిన కాలేజీలు ఈళ్ళు ఇడిచి పెట్టి ఈళ్ళకంటూ విడిగా కాలేజీ లెట్టుకొంటే బాగా మార్కులొచ్చినా ప్రెభుత్వం ఎట్టిన కాలేజిల్లో సీటు వచ్చే అంత బాగా రాని కుర్రాళ్ళు తల్లి పుస్తె తాడు తప్ప ఏ ఆధారం లేని ముష్టెదవలందరూ అవి అమ్మేసి ఫీజులు కట్టడానికి సిద్ధపడుతుంటే ఈళ్ళ కొళ్ళు మండిపోయి ఎంట్రెన్సు పరీచ్చలెట్టేశారు. ఈ పద్ధతిలో ఫీజుకి డబ్బుంటే సాలదు, ఎంట్రన్స్ పరీచ్చలో పాసవడానిక్కూడా డబ్బుండాలి. మార్కులూ పరీచ్చల్లో వొచ్చే ప్రశ్నలూ చవగ్గా దొరకవు కదా! ఈళ్ళని మనోళ్ళు ఆ విధంగా పోటీ నుంచి తప్పించేశారుట. రాజుగోర్చెప్పారు. ఇంతకూ నువ్వు మద్రాసెళ్ళే దేదో ఇట్టాంటి బాగోతం నడిపించడానికేట కదా?''

"అవును. పరీక్షలు కండక్ట్ చెయ్యమని మెడ్రాసు వెళ్ళమన్నారు. మా సంస్థకి పరీక్ష లెందుకు పెట్టారుట? రాజుగారేమన్నా చెప్పారా?'' గోపన్న తన అజ్ఞాన తిమిరాన్ని పారదోలుకో దల్చి మావని అడిగాడు.

"చెప్పారు. చెప్తా నాగు. నీకు ప్రెతీ దానికి కంగారే. చిన్న మూఢయ్యగారికీ పరీచ్చల తంతు చూస్తే ముచ్చటేసింది. ఈ తంతు ప్రెబుత్వపు లాబ్రెట్రీల కెట్టిస్తే దేశం నాలుగు మూలలా పరీక్షా కేంద్రా లెట్టుకొని అక్కడకి డూటీ లేసుకొని ప్రెబుత్వపు కర్చు మీద దేశం నాలుగు చెరుగులా తిరుగుతూ పలుకుబడి పెంచుకొంటూ పరిచయాలు నిలబెట్టుకొంటూ వుండచ్చుకదా అని ఆలోచించి తనలాటి పెద్దోళ్ళందర్నీ పిలిచి మీటింగెట్టాడు. మీ లాబ్రెట్రీ నుంచి రామరాజు గోరెళ్ళారంట.

మనది కేంద్ర సాంస్థ. మనకి ప్రాంతీయాభిమానలుండగూడదు. లేవు కూడా. అన్ని ప్రాంతాల్నుంచి కుర్రాళ్ళు దరకాస్తులెడ్తారు. ఎవరు వొౝెమో ఎవరుత్త రాయో పోల్చుకోడం కష్టం'' అని మూఢయ్య అంటే-

"ఇంటర్వ్యూలు పెట్టి తేల్చుకొంటాం కదా'' అన్నడంట మన్నాజుగోరు. బలే గట్టోడులే!!

"ఇంటర్ వ్యూల్లో అందర్నీ ఒకే ప్రెస్నలెయ్యంగదా! వేస్తే వెనకోడికి ప్రెస్నలన్నీ తెల్సిపోతాయి అందుకని రాత పరీచ్చ లెట్టడం ధర్మం.'' అని అందర్నీ మూఢయ్య ఒప్పించాడు.

"మా కలకత్తాలో ఓ సెంటరెట్టండి'' అన్నాడు సేన్‌గుప్తా.

"సౌతులో ఒక టుండాలి. తప్పేదే ముంది మా మద్రాసులో ఒకటి'' అన్నాడు రామనాథన్.

"హైదరాబాద్‌లో యెందుకుండరాదు.'' అని రాజుగోరు కోపంగా నిల్దీశాడు.

అప్పుడు అందరూ "సౌతులో యెన్నుండాలేం, ఒకట్చాలు! తెలుగోళ్ళవి బొత్తిగా ప్రాంతీయ తత్వాలు'' అని అందరూ రాజుగోర్ని కేకలేసినోరు మూయించారుట. సౌతంటే మద్రాసేనా? హైదరాబాద్ కాదా?'' అని ఆయన అన్నా యెవరూ వినిపించుకోలేదంట.

ఇంతకూ గోపన్నా. ఎ(్రోడేమారం ఎళ్ళొచ్చినట్టు కాక మద్రాసెళ్ళినప్పుడు చుట్టుపట్ల చూసిరా. అమ్మాయి నీతోసుకెళ్ళు. దార్లో మీ చెల్లెలికి ఓ మంచి సంబంధం కబుర్తెచ్చాను. ఎళ్ళి మాటా మంచి కనుక్కుందారి. పక్కన్నేనుంటాలే డబ్బు నేనెడ్తాలేరా."

సిద్దయ్య చివరకి వచ్చిన చుట్ట పారేశాడు "నే పడుక్కుంటా" అంటూ ఆపట్న లేచి డాబా మీదకు వెళ్ళిపోయాడు. గోపాల్రావ్ ఎదుటి కుర్చీలో కాళ్ళు జాపుకొన్నాడు.

మణి వచ్చి ఎదురుకుర్చీలో కూర్చుని, "నా పిచ్చి గోపీ! నా మంచి గోపీ! నా బంగారు గోపీ!" అంది గోపాల్రావ్ కాళ్ళందుకొంటూ.

మణిని తనతో తీసుకువెళ్ళటానికి గోపాల్రావ్ ఒప్పుకొన్నాడు భక్తికి మెచ్చి.

మద్రాసు బయల్దేరాల్సిన రోజున గోపాల్రావ్, సిద్దయ్య, మణి, పాప రైలు స్టేషన్‌కి జేరుకొన్నారు. తెల్ల కాయితాలు, ప్రశ్నాపత్రాలు పెట్టిన భోషాణపు పెట్టి మీద మణి పాపని వళ్ళో పెట్టుకొని కూర్చుంది. రైలు గంట ఆలస్యం అయిందని ఎనౌన్సర్ చెవులు బద్దలయ్యే లాగును, ఎంతో శ్రద్ధగా వింటే తప్ప అర్థంకాని విధంలోను ప్రకటించాడు. గోపాల్రావ్ ఏదైనా పత్రిక కొందామని పుస్తకాలు కొట్టుకేసి నడిచాడు. అక్కడో దృశ్యం అతన్ని ఆకట్టుకొంది.

ఓ అబ్బాయి పద్దెనిమిదేళ్ళ వాడు ప్లాట్ మీద చుట్టూ పుస్తకాలు పరుచుకొని వాటి మధ్య గొంతుక్కూర్చున్నాడు. ఆ పక్కనే ఓ నలభై అయిదేళ్ల ఆయన డైరీ చూస్తున్నాడు.

ఆ అబ్బాయి ఆ నడివయస్సు ఆయన్ని ఏదో అడిగాడు. ఆ పెద్దమనిషి ఆ డైరీ పేజీలు తిప్పి జవాబు చెప్పాడు. ఆ అబ్బాయి చుట్టూ వున్న పుస్తకాల్ని కంగారుగా నెత్తిమీది జుట్టు పరకలు పీక్కుంటూ పరికించి రెండు పుస్తకాల్ని ఏరుకొన్నాడు.

ఆ పక్కనే వున్న నలభై ఏళ్ళున్న స్త్రీ ఆ కుర్రాడికి హార్లిక్స్ కలిపి యిచ్చింది. ఆ సీను గోపాల్రావ్‌కి హార్లిక్స్ ఎడ్వర్‌టైజ్‌మెంటు షూటింగ్‌లా కనిపించలేదు. ఏమిటో విషయం కనుక్కొందామనుకొన్నా, ముక్కు మొహం తెలియనివాళ్ళని యే మడగాలో బోధపడలేదు. తన మావ సిద్దయ్య భోగట్టాలు సేకరించడంలో సిద్ధహస్తుడు. అతగాడికా పని పురమాయించాలి అనుకొని తన కుటుంబం కూర్చున్న చోటికి తరిలి వెళ్ళాడు.

"మావయ్యా! అక్కడో అబ్బాయి పుస్తకాల మధ్య కూర్చున్నాడు చూడు" అన్నాడు సిద్దయ్యతో.

"ఏదీ చేతిలో ఫ్లాస్కులో నిలబడ్డ అమ్మాయి పక్కనేనా?" అని అడిగాడు సిద్దయ్య.

"మరే! వాళ్ళు చూడ్డానికి తెలుగు వాళ్ళలా ఉన్నారు. ఏమిటో ఊ కంగారు పడిపోతున్నారు. కొంచెం విషయం కనుక్కో" అన్నాడు గోపన్న.

సిద్దయ్య ఆ కుటుంబాన్ని కలిసి కబుర్లు చెప్తూ కూర్చున్నాడు. ఇంతలో రైలు వచ్చింది. గోపాల్రావ్ ఫస్టు క్లాసులో మూడు బెర్తులు రిజర్వ్ చేయించాడు. ఆ పెట్టి వెతికి పట్టుకొని అందులోకి ఎక్కారు. అందులో నాలుగో ప్రయాణీకుడు పై నుంచి వస్తున్నాడు. అతనికీ ఒక నల్లపెట్టె ఉంది.

గోపాల్రావ్ బెడ్డింగ్ విప్పాడు. పాపకి పక్కపరిచి పడుకోబెట్టింది మణి.

"మావయ్యా! కనుక్కున్నావా?" అని అడిగాడు గోపాల్రావ్.

"ఆఁ"

మణి విసుగ్గా చూసింది.

"నువ్వు కాస్సేపు పైకెక్కి పడుకో తల్లీ! రాత్రసలే ఇల్లు సద్దడంలో నీకంటికి కునుకు లేదు. నేను, గోపన్న కాస్త ఊసులుజెప్పుకునేసరికి ఓ చిన్న కునుకుతీసి లేద్దువుగాని" అన్నాడు సిద్దయ్య కూతురితో. మణి పై బర్త్ మీదకెక్కింది. మణిని నిదానంగా చూసి సిద్దయ్య కథ మొదలు పెట్టాడు.

"ఆ అబ్బాయి పడమట్నేదో పరీచ్చ రాయడానికెళ్తున్నాడ్రా. ఇప్పటికో పది రాశాడంట. మరో పది రాయాలంట. పెద్ద పరీచ్చల్లో మంచి మార్కులొస్తాయని చెప్పాడు. కాని వాటి బట్టీ ఈ సీట్లు ఇయ్యరు గదా! ఈ సీట్లు ఎంట్రెన్స్ పరీచ్చల్లో వచ్చే మార్కుల బట్టి ఇస్తారని, అందుకని ప్రెతి పరీచ్చకి బయం, కంగారు పడ్తాడంట."

"ఎక్స్క్యూజ్మి. నేను కూడా తెలుగు వాడ్నే. నా పేరు శర్మ. నేను మద్రాసు నుంచి ఓ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ కండక్టు చెయ్యడానికి వెళ్ళి వస్తున్నాను. ఆ అబ్బాయి అన్ని పరీక్ష లెందుకు రాయాల్సొచ్చిందట" అని అడిగాడు పెట్టెలో నాలుగో మనిషి

"ఐ.ఐ.టి.లకి, రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీలకు, సెంట్రల్ యూనివర్శిటీకి, మామూలు యూనివర్శిటీస్కి, ప్రైవేటు కాలేజీలు అన్నింటికి అప్లికేషన్స్ పడేసి ఉంటాడు" అన్నాడు గోపాల్రావ్.

"అంతే మరి" అన్నాడు సిద్దయ్య.

గోపాల్రావ్ తనని, తన మావయ్యని శర్మకి పరిచయం చేసేడు. సిద్దయ్య తనకున్న పలుకుబడి గురించి, ఆస్తి గురించి అడక్కుండానే కొంత భోగట్టా యిచ్చాడు. ఆ పైన గోపన్న కేసి తిరిగి, "అందులో కొన్ని పరీచ్చలు వాళ్ళ పక్కూళ్ళోనే రాయచ్చంట. కాని అన్నింటికీ అట్లా కుదరదంట. ఆ కుదరనోటి కోసం మరో వూరెళ్ళాల్సి రావటంతో కుదిరనోటిక్కూడా వెళ్ళిన మరో వూరు నుంచి సమయానికి జేరుకోడం కుదరక పరాయి ఊళ్ళో రాయాల్సి వస్తోందట. రేవు పడమట్న రాసే పరీచ్చకి వాళ్ళ పక్కూళ్ళో సెంటరున్నా ఈళ్ళు ఎల్లుండిగ్గాని అక్కడికి జేరుకోలేరు. అందుకని రేపటికి జేరుకోగలిగిన ఊళ్ళో రాస్తానని అబ్బాయి రాసుకున్నాడంట అప్లికేసన్లో. ఆ పిల్లోడి తండ్రి సానా జాగ్రత్తగా టూర్ ప్రోగ్రామ్ తయారుచేశాడట అయితే ఈ తిరుగుళ్ళతో దేశాటనం బానే అయినా, డబ్బు డబ్బులా కర్చవుతోందంట" అని నవ్వాడు సిద్దయ్య.

"డబ్బు డబ్బులా ఖర్చవక ఎల్లా అవుతుందేం?" ఈ ప్రశ్న గోపన్న వెయ్యలేదు. శర్మ అడిగాడు. అందుకే కానుకూర్చున్న సిద్దయ్య :

"పూర్వం నీళ్ళలా కర్చవుతోందనే వారు. ఇప్పుడు వాడకానికి సిటీస్లో నీళ్ళెక్కడ! కార్పొరేషన్ నీళ్ళు బంగారంలా కర్చెడ్తున్నారు జనం! మా గోపన్నింటో చూశా. డబ్బుకి ఇలవ పోయాక ఎవడి చేతిలో చూసినా డబ్బే.. ఎదవది నీళ్ళకంటే సవకయి పోయింది"

శర్మ సిద్దయ్యతో ఏకీభవించాడు.

"పాపం ఆ కుర్రోడి తల్లి నగలు తాకటెట్టి తిరుగుతున్నారంట! డబ్బు పోతే పోయింది. కుర్రోడి ఆరోగ్యం దెబ్బ తింటుందని తల్లి బయం. అందుకని అరగంట అరగంటకి - సినిమాల్లో చూసిందంట - ఆర్లిక్స్ కలిపిస్తావుంది" అన్నాడు సిద్దయ్య.

"మరో శతావధాని అన్నమాట!" అన్నాడు గోపన్న.

"ఆ అబ్బాయి పేరు వీరవదాని. మన తెలుగోళ్ళే- అందుకే ఇన్ని ఇసియాలు రాబట్టా. నాకు హిందీ రాదుగా" అన్నాడు సిద్దయ్య మోడెస్ట్‌గా.

"పరీక్షలు పెడితే శతావధానులు, పెట్టకపోతే ప్రాంతీయాభిమానాలు" అన్నాడు శర్మ.

"మరే- మన ఆంధ్రాలో ఒక పట్టాన మార్కులు వెయ్యరు. అదే తమిళనాడులో చూడండి. మార్కులు కుప్పించేస్తారు" అన్నాడు గోపాల్రావ్.

"ఢిల్లీ వాళ్ళు అసలు సౌత్‌లో మార్కులకి విలువలేదని నార్త్‌లో అరవై వచ్చిన వాళ్ళ కాలిగోటికి సౌత్‌లో ఎనభై వచ్చిన వాళ్ళు కూడా సరిపోలరని. అందుకని ఈ ఎంట్రెన్సు లుండాలన్నారు" అన్నాడు శర్మ.

"మనల్నంతటి మాట లన్నారా? నోట్లోంచి ఇంగ్లీషు ముక్క రానివాళ్ళు" అన్నాడు గోపాల్రావ్.

"అందుకే వాళ్ళు 'ఇంగ్లీషెందుకు రావాలి?' అని అడుగుతున్నారు. ఐ.ఐ.టి. ఎంట్రెన్స్‌లో ఇంగ్లీషులో 25% వొస్తే చాలని, అంతకంటే ఎక్కువ తెచ్చుకున్నా దానికి విలువలేదని నిర్ణయించారు తెల్సుకదా!" అన్నాడు శర్మ.

"నిజమా?" గోపాల్రావ్ ఆశ్చర్యపోయాడు.

"ఈ ఎంట్రెన్స్ పరీక్షలు డబ్బున్న వాళ్ళు కుట్ర పన్ని ఏర్పరిచారేమో అనిపిస్తోందండి. ఏ పరీక్ష పెట్టినా దేశంలో కొద్ది సెంటర్లలోనే పెడ్తాం కదా. అక్కడికి చిన్న ఊళ్ళ నుంచి- అంటే మూడువందల్నాలుగు వందల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి పరీక్ష వ్రాయాలి. రైల్వే మంత్రులు టిక్కెట్టు ధరలు పెంచుకొంటూ పోతున్నారు ప్రతీ సంవత్సరం. రైలు ఛార్జీలు కాకుండా పరీక్ష పెట్టిన పెద్ద ఊళ్ళో మూడ్రోజులపాటు హోటల్లో ఉండాలి. దానికి తిరిగి ఖర్చు. భోజనం పడకపోతే ఖర్చు మాట దేవుడెరుగు. ఆరోగ్యానికి దెబ్బ. రెండు మూడు పరీక్షలాసే సరికి తల ప్రాణంతోక కొస్తుంది" అన్నాడు శర్మ.

"కాని ఒకే కొలబద్దతో కొలవడం మరోలా సాధ్యం కాదే!" న్నాడు గోపాల్రావ్.

"అదే దౌర్భాగ్యం మనక్కూడా జి.ఆర్.ఇ. లాంటి పరీక్ష ఒకటుండి ఏడిస్తే కుర్రాళ్ళిన్ని పరీక్షలు రాయాల్సిన శ్రమ ఉండదు. ప్రతి సంస్థ వాళ్ళూ పరీక్షలు పెట్టుకొంటూ పోతే దానికి అంతేమిటి! అవి కుర్రాళ్ల అంతు తేల్చడానికి తప్పించి" శర్మ అంటుంటే రైలు ఏదో స్టేషన్‌లో ఆగింది.

"ఏ స్టేషన్?" అని మణి అడిగింది. గోపి చెప్పాడు. గోపాల్రావ్ కాఫీ ఆర్డరివ్వడానికి

దిగాడు. వీరావధాని తండ్రి కనబడి, "ఏస్ప్రిన్ మాత్రలెక్కడ దొరుకుతాయండీ! నాకీ ప్రాంతం కొత్త" అని అడిగాడు గోపాల్రావ్ని.

"అదిగో ఆ పెట్టెలో మా ఆవిడ నడగండి ఇస్తుంది" అని గోపాల్రావ్ చెప్పాడు.

"మావాడికి తలనొప్పిగా వుందిట కొంచెం జ్వరం తగిలే సూచనలున్నాయి." అన్నాడా పిల్లాడి తండ్రి, మాత్రలు మణి దగ్గర తీసుకొంటూ సిద్ధయ్యతో.

రైలు క్షేమంగా మద్రాసు జేరింది. గోపాల్రావ్ పరీక్ష సెంటర్నీ, దాని అధికారుల్నీ, ఆపైన మహా బలిపురాన్నీ చూసుకొన్నాడు. సరైన రోజున పరీక్ష పెట్టాడు. ఆన్సర్ పుస్తకాలు భోషాణం పెట్టెలో సర్దుకొన్నాడు. కంచి చూశాడు. మణి కక్కడో చీర కొన్నాడు.

"నా బంగారు గోపీ!" అని నుదుటి ముద్దు పెట్టుకొంది మణి ఆ సమయంలో ప్రయాణానికి ఎంత ఖర్చు అయిందో లెక్క వెయ్యబోతున్న గోపాల్రావ్ తబ్బిబ్బు అయి ఆ ప్రయత్నాన్ని విరమించుకొన్నాడు.

తిరుగు ప్రయాణం రోజున మద్రాసు సెంట్రల్కి చేరుకున్నారు అందరూ. సిద్ధయ్య సినిమా తారలెవరైనా రైలెక్కడానికి, లేక ఎవర్నైనా ఎక్కించడానికిగాని వచ్చేరేమోనని అలా ప్లాట్ఫామ్ మీద చిన్న చెక్కర్లు కొట్టడం మొదలుపెట్టాడు. జయప్రద, జయమాలిని కనిపించలేదు గాని వీరావధాని కనిపించాడు.

ఆ పిల్లాడు నేల మీద పడుక్కోని వున్నాడు. తల్లి కణతలకి అమృతాంజనం రాస్తోంది. అవధానికి జ్వరం అని ఇంక రెండే రెండు పరీక్షలున్నాయని, ఆవి వ్రాసేసి వ్రతం పూర్తి చేసుకొని వెళ్ళిపోతామని ఆ పిల్లాడి తండ్రి సిద్ధయ్యతో కష్టం నష్టం చెప్పుకొన్నాడు.

ఇంతలో సిద్ధయ్య ఎక్కాల్సిన రైలు రావటంతో వెళ్ళి కూతుర్ని, అల్లుడ్ని చేరాడు. అందరూ రైలెక్కారు. ఆ రైలు హరిశ్చంద్రుడి ఊరు వెళ్తోంది. అతడు సిద్ధయ్యకి పిన్తండ్రి కొడుకు.

"ఆ ఊళ్ళో వయస్సుండి ఛాన్సొచ్చి నాయన వాయిచ్చాన్సెలర్ ఉన్నాడు. ఓపాలి ఆయన్ని చూడ్దారి. ఓసారి మీ అల్లుడ్ని చూపించండి, ఎందులో ఐనా యిరికిద్దా రన్నాడ్రా ఆయన" అని సిద్ధయ్య గోపాల్రావ్ని బతిమాలాడు.

"హరిశ్చంద్రుడు బాబాయిని చూసి చాలా రోజులైంది చూద్దాం" అని మణి ముచ్చట పడింది.

"ఊఁ ఊఁ" అంది పాప.

"వెళ్ళి ఆయన మీద మనం అంతా పడ్తే ఏం బావుంటుంది?" అని మొహమాట పడ్డాడు గోపన్న.

"ఆడిది లంకంత కొంప. యూనివర్సిటీ వోళ్ళ కోర్టర్స్" అన్నాడు సిద్ధయ్య.

గోపన్నకి సాకు దొరకలేదు. సిద్ధయ్య తాము వస్తున్నట్టు తమ్ముడికి ఉత్తరం వ్రాశాడు.

వీళ్ళు వెళ్ళేసరికి హరిశ్చంద్రుడింట్లోనే ఉన్నాడు బెల్టేసి నడుం బిగిస్తున్నాడు.

"దేనికిరా నడుం బిగిస్తుండావ్" అని సిద్ధయ్య చనువుగా అడిగాడు.

"ఈ రోజు మా బళ్ళో ఎంట్రెన్స్ పరీక్షలు" అన్నాడతను నవ్వుతూ.

"మీ యూనివర్సిటీలోనా! దాంట్లో జేరేవాళ్ళంతా చాలా వరకు మీ పాత విద్యార్థులేగా! మీ యూనివర్శిటీలో బియ్యేలు, బీయస్సీలు పాస్ అయినవాళ్ళు మీ దాంట్లో ఎమ్మేలు, ఎమ్మెస్సీలు చదవాలంటే పరీక్షలు రాయాలా! చాలా ఆశ్చర్యంగా వుంది." అన్నాడు గోపాల్రావ్ ఆశ్చర్యంగా.

"ఎందుకు రాయకూడదు? మీరంతా పరీక్షలు పెట్టచ్చుగాని మేమ్మాత్రం పెట్టడానికి పనికిరామా? అమ్మాయి మణీ! అల్లుడుగారికి పెసరట్టు పెట్టు. పిన్ని పెనం మీద వేడి వేడిగా వేస్తోంది. నేనొస్తానన్నయ్యా" అంటూ ప్రొఫెసర్ హరిశ్చంద్రుడు పరీక్ష నిర్వహణార్థం వెళ్ళి పోయాడు.

సిద్ధయ్య, గోపన్న కాఫీల్తాగి స్నానాలు చేసి, పెసరట్లు తిని కాఫీల్తాగారు. అప్పుడు వైస్ ఛాన్సలర్ని చూడ్డానికి వెళ్ళారు.

వీళ్ళు వెళ్ళేసరికే ఆయన ఆఫీసు వందిమాగధుల్తో నిండిపోయింది.

"అయ్యగోరూ శానా బిజీగున్నారు" అన్నాడు ద్వారపాలకుడు.

"ఇయిగో ఈ చుట్టల్దీసుకెళ్ళి మీ అయ్యగారికి కియ్యి. వచ్చిందెవరో ఆయనే పోల్చు కుంటారు" అంటూ సిద్ధయ్య జేబులోంచి ఓ కట్ట తీసి ద్వారపాలకుడి చేతిలో పెట్టాడు అతను తీసుకువెళ్ళి లోపల యిచ్చాడు.

వాటిని వాసన చూసి పోల్చుకొని, "సిద్ధయ్యగార్ని బయట్నిలబెట్టావా- తప్పు కాదూ" అని బంట్రోతుతో అని తనే బయటకి వచ్చి సిద్ధయ్య కెదురువెళ్ళి గౌరవం చేశాడు. మావా అల్లుళ్ళు లోపలకి రాగానే వందిమాగధులిద్దరు లేచి నిలబడ్డారు. ఖాళీ అయిన రెండు కుర్చీల్లో సిద్ధయ్య, గోపన్న కూర్చున్నారు. అప్పుడు బంట్రోతు స్టాండు వెనకాతల్నుంచి రెండు కుర్చీలు తెచ్చి వందిమాగధులకి వేశాడు.

అడ్డమైనవాళ్ళూ వచ్చి తనకెదురుగా కూర్చోకుండా పెద్దాయన ఆ ఏర్పాటు చేశాడు. సాధారుణులు వస్తే వందిమాగధులు లేవరు. అప్పుడు కుర్చీలు ఖాళీగా ఉండవు. వచ్చినవాళ్ళు నిలబడే మాట్లాడి వెళ్ళిపోతారు.

సిద్ధయ్య పెద్దాయనకి తన అల్లుడిని పరిచయం చేశాడు.

"మీతో మీ తమ్ముడు హరిశ్చంద్రుడు గారు రాలేదా" అని అడిగాడు వైస్ ఛాన్సలర్.

"ఇవాళేదో పరీచ్చలున్నాయంటగా! పొద్దున్నే లేచి అటుకేసి పోయాడు. పనంటే మరీ స్రెద్ద మా తమ్ముడికి" అన్నాడు సిద్ధయ్య.

గోపాల్రావ్కి ప్రశ్న గొంతుకలో ఇమడక, మింగుడు పడక, కక్కాలేక ఇబ్బంది పడ్తున్నాడు. అది చూసి పెద్దాయన-

"మా యూనివర్సిటీలో జేరాలను కుంటున్నోడివి అంత ఆలోచిస్తావెందుకు? సందేహం తీర్చుకో. మాది చాలా ఫ్రీ యూనివర్సిటీ" అన్నాడు.

"మీ యూనివర్సిటీలో జేరేవాళ్ళందరూ మీ యూనివర్సిటీ ఎఫీలియేటెడ్ కాలేజీలో చదువుకొని మీరు పెట్టిన పరీక్షలు పాసై వచ్చేవాళ్ళే కదా" అన్నాడు గోపన్న.

"అంతే" అన్నాడు ప్రొఫె. వంది వైస్ ఛాన్సలర్ జవాబుచెప్పే శ్రమ తప్పిస్తూ .

"మరి వాళ్ళకీ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్స్ బెడద మళ్ళీ యెందుకు?" గోపన్న సందేహం బయటపెట్టాడు.

"కొంతమంది పై యూనివర్సిటీల నుంచి వస్తారు కదా!" అన్నాడు డాక్టర్ మాగధి.

"పై యూనివర్సిటీ వాళ్ళకి లిమిటెడ్ సీట్స్ కదా!" గోపన్న లైన్ ఆఫ్ ఆర్గ్యుమెంట్ కంటిన్యూ చేశాడు.

"మీ రందరూ పెట్టాల్సిన వోళ్ళూ, మేమేమో పెట్టక్కలేని వోళ్ళమునా?" వైస్ ఛాన్సలర్ కోపంగా అడిగాడు.

"ఊర్కోరా గోపన్నా, పై రాష్ట్రాల కుర్రాళ్ళ కంటూ అట్టే పెట్టిన అయిదు సీట్లకీ యాభై అప్లికేషన్స్ వస్తాయి. వాళ్ళ కెల్లాగో పరీచ్చలెట్టాలిగందా! ఆళ్ళకెట్టినప్పుడు ఆళ్ళతో పాటు మనోళ్ళని కూడా రాయమనడం కాస్త కాంపిటీసన్ పెట్టి నట్టవుద్ది. అన్నీ ఆలోసించెట్టుంటారు" అన్నాడు సిద్ధయ్య మందలింపుగా.

గోపాల్రావ్ మందోకి రానన్నాడు. "పెట్టి ఏం సాధించారు?" అని అడిగాడు. అమెరికాలో ఏం వచ్చినా రాకపోయినా నిర్దయడాలు, నిలువునా చీల్చడాలు నేర్చు కొన్నాడు.

"అల్లా అడిగితే కదా చెప్తాం. ఈ పరీక్షలు పెట్టిన తరువాత యూనివర్సిటీలో ఆడపిల్లల సంఖ్య పెరిగింది. వెనకబడిన జాతుల సంఖ్య పెరిగింది." ప్రొఫ్ వంది సమర్థించాడు.

"కాలక్రమేణ ఆడపిల్లల్లోను, వెనక బడిన జాతుల్లోను చదువుకునేవారి సంఖ్య పెరుగుతోంది. దాని వల్ల వాళ్ళ సంఖ్య పెరిగిందే కాని ఈ పరీక్షల వల్ల కాదు. స్పూరియస్ కారిలేషన్స్ అంటారు సైన్సులో, మీరు చెప్పే కారాణాలని" గోపన్న నిర్మొహమాటంగా.

"మా స్టాండర్డ్స్ పెరిగాయి" అన్నాడు డాక్టర్ మాగధి.

"మేం పెట్టే ఎంట్రన్స్ పరీక్షల్నే తప్ప, మా యూనివర్శిటీ డిగ్రీ లివ్వడానికి పెట్టే పరీక్షల్ని నమ్మలేం" అన్నాడు డాక్టర్ మాగధి మరింత ఉత్సాహం పుంజు కొని ప్రొఫ్. వంది ఇబ్బందిగా మొహం పెట్టాడు.

గోపన్న నోరు తెరవబోతుండగా, "పదరా గోపన్నా! వయిస్ ఛాన్సలర్‌గారికి బోలుడు పనులుంటాయి" అంటూ సిద్ధయ్య లేచి సెలవు పుచ్చుకొని అల్లుడ్ని లాక్కుపోయాడు.

సాయంత్రం పినమావగారితో వంది మాగధుల ప్రసక్తి తెచ్చాడు గోపన్న.

"వాళ్ళు భట్రాజులు. వైస్ ఛాన్సలర్ కేదో కొత్తపని చెయ్యాలని పిస్తుంది. వీళ్ళు వెంటనే అవి తమ అయిడియా లైనట్టు చెప్పి వాటికి బోలుడు సైంటిఫిక్ కారణాల్లా కనిపించే కబుర్లు చెప్తారు. అప్పుడు ఆయన కన్విన్స్ అయినట్టు నటించి అది చేస్తాడు. పూర్వం ఆయన గదిలో మూడు కుర్చీలుండేవి. నేను ఈ భట్రాజుల పొగడ్తల కడ్డు తగుల్తుంటే ఒక కుర్చీ తీయించేశారు" అన్నాడు హరిశ్చంద్రుడు.

"నా కన్ని తెలివితేటలు లేవు. ఈ ఊళ్లో నాకు కుర్చీ వేసినా కూర్చునే అర్హత లేదు. మా లాబ్ నయం మా రాజుగారు రామరాజుగారు దేవుడులాంటి మనిషి" అన్నాడు గోపన్న ఒకరియెడల భయం, మరొకరిపట్ల భక్తి ప్రదర్శిస్తూ.

గోపాల్రావు కుటుంబం స్టేషన్‌లో రైలు కోసం నిరీక్షిస్తోంది. ఇంతలో "యురేకా! యురేకా!" అని అరుపులు వినిపించాయి. పాప చెవులు మూసింది వెంటనే మణి. గోపన్న, సిద్ధయ్య అటుకేసి వెళ్ళారు.

ఆ అరుస్తున్నది వీరావధాని తండ్రి. వీరావధాని తనలో తాను గొణుక్కుంటున్నాడు పిచ్చి ధోరణిలో, "డి వై బై డియక్స్ పాజిటివ్ అయితే సీటు వస్తుంది. జీరో అయినా, నెగటివ్ అయినా రాదు" అంటూ.

"రోజుకో పరీక్ష ఊరు అయితే వీరావధానికే కాదు ఎవరికైనా వున్న మతి పోక ఎన్నాళ్ళుం టుంది." అని జాలిపడ్డాడు గోపన్న. వీరావధాని తల్లి కొడుకు నుదుటి మీద తడిగుడ్డ వేస్తూ కూర్చుంది.

సిద్ధయ్య వీరావధాని తండ్రి నిలబడ్డ దిక్కుగా నడిచాడు. అతను ఇంకెవరితోనో మాట్లాడుతున్నాడు. మాటాడ్తూ మధ్యలో "హా తెలిసెన్" అంటున్నాడు. సిద్ధయ్య వీరావధాని తండ్రిని "ఏటి తెలిసిపోయింది. పరీచ్చా ఫలితాలా?" అని సమాచారం అడిగాడు. ఆయనకి తనకి తెలిసింది సిద్ధయ్యకి చెప్పాడు.

ఇంతలో రైలు వచ్చింది. సిద్ధయ్య, గోపన్న, మణి, పాప అంతా రైలెక్కారు.

"ఏమిటి మామయ్యా! ఆయనల్లా తెలిసింది తెలిసిందని అరుస్తున్నాడు?" అని అడిగాడు గోపన్న.

"మొదలయ్యాయీ అల్లుడు, మావల కథలు" అని విసుక్కుంది మణి.

మణికేసి ఒకసారి పరిశీలనగా చూసి "ఇది వుపసాంహారంలే అమ్మడూ. ఈరావధాని కత పూర్తి చెయ్యకపోతే మొండితేలు కుట్టుద్ది. అందుకని యిది పూర్తిచేసి ఆపేస్తాను" అన్నాడు సిద్ధయ్య.

సిద్ధయ్య చెప్పిన కథకి సారాంశం ఇది:

వీరావధాని ఎన్నో చోట్ల పరీక్షలు వ్రాసినా సరిగ్గా వ్రాయలేకపోయాడు. నిజానికతడు బోలుడు కష్టపడి చదివాడు. కాని ఒకచోట పరీక్షలొకోలా ఉన్నాయి. ఒక ప్రశ్నకి ఒకచోట రెండు మార్కుల ప్రశ్న అయితే- మరోచోటా అది ఇరవై మార్కుల ప్రశ్నయి భుజం మీద కండువా కప్పుకొని తిరిగింది. అన్నిచోట్ల సిలబస్ ఒకటే! కాని ప్రశ్నల వెడల్పు, లోతు వేరు వేరుగా ఉన్నాయి దాంతో అతనికి కనీసం ఒకచోటైనా సరిగ్గా జవాబులు వ్రాసిన తృప్తి కలుగలేదు. తన మీద తనకే నమ్మకం తగ్గిపోయింది. కొంత వెర్రి వాలకం పడ్డాడు.

అటువంటి సమయంలో వీరావధాని తండ్రి మరో కుర్రాడి తండ్రిని కలుసుకొన్నాడు. ఆయన కూడా తన కొడుకుని ప్రతి సంతకి తీసుకువచ్చాడు. అయితే ఆ అబ్బాయి అసలు కంగారు చూపించలేదెక్కడా. నిలకడగా, నిదానంగా, చిరునవ్వు చెరక్కుండా చక చకా పరీక్షలు

వ్రాస్తూ వచ్చాడు. వీరావధాని తండ్రి ఆశ్చర్యంతో "మీ అబ్బాయి ఎప్పుడూ నవ్వుతూ పరీక్షలు రాయటంలోని రహస్యం ఏమిటి?" అని ఆ రెండో తండ్రి నడిగాడు.

ఆ తండ్రి నవ్వాడు. ఆ నవ్వులో జాలి వుంది, గర్వం వుంది.

"గత సంవత్సరం నేను మరొకర్నిదే ప్రశ్న వేశాను. అప్పుడు మా అబ్బాయి ఇలాగే ఊరుకో పరీక్ష రాసి వడదెబ్బ తిన్నాడు. అప్పుడు ఆ మరొకరు చెప్పిందే మీకు చెప్తున్నాను వినండి. శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలు. ప్రవేశ పరీక్షలుంటే అవి పాసవడానికి మార్గాలుంటాయి. ప్రతీ పరీక్షకీ ట్యుటోరియల్ కాలేజీలుంటాయి. ఆ కాలేజీ వాళ్ళు పోస్టల్ ట్యూషన్స్ ఇస్తారు. పాత ప్రశ్నా పత్రాలకి జవాబులు సప్లయి చేస్తారు. ఈ సంవత్సరం ఏ ప్రశ్నలు రాబోతాయో ఊహిస్తారు. ఆ కాలేజీలకి పెద్ద పెద్ద ప్రొఫెసర్లు సలహాదారులుగా ఉంటారు. ఎంట్రెన్సు పరీక్షలు పెట్టేది వాళ్ళే! వాళ్ళ ప్రశ్నలకి వాళ్ళే విధమైన ఆన్సర్లు ఎక్స్‌పెక్ట్ చేస్తారో వాళ్ళకంటే బాగా తెలిసినవాళ్ళు మరొకరుండరు కదా! అందుకని ఈ ట్యుటోరియల్ కాలేజీవాళ్లు వీళ్ళని సలహాదార్లుగా వేసుకొని వీళ్ళచేత గైడ్స్ రాయిస్తారు. అవి వాళ్ళ ట్యూషన్ తీసుకొన్న వాళ్ళకి సప్లై చేస్తారు. అదో పెద్ద వ్యాపారం- యివిగో ఎడ్రసులు. నెక్స్ట్ యియరు మీ అవధాని సెలక్టవకపోతే నన్నడగండి" అంటూ ఆ రెండో తండ్రి చెప్పాడు.

వీరావధాని తండ్రి "మహాప్రసాదం" అన్నాడు. "యురేకా" అన్నాడు. "హాఁ తెలిసెన్" అన్నాడు.

"అదిరా గోపన్నా కత! పై ఊళ్ళో మీ చెల్లిలికి సంబంధం ఉందన్నానే. ఆ కుర్రాడిట్టాంటి కాలేజీ నడుపుతున్నాడు. ఏడాదికి లచ్చా యాభై వేలు సంపాదిస్తాడు. ఇన్‌కమ్‌టాక్స్ గొడవలు లేవు. ఆ కుర్రోడికి సదువు పూర్తివగానే ఉజ్జోగం దొరకలా! దాంతో ఈ కాలేజీ తెరిచాడు. కుర్రోళ్ళ సందేహాలు సలహాదార్లకి, ఆళ్ళ జవాబులు కుర్రోళ్ళకి తపాలా బంట్రోతులా చేరేస్తూ వుంటాడు. కడుపులో సల్ల కదలకుండా డబ్బు సంపాదిస్తాడు. బాంకులో వేసుకోలేడు కనుక పెళ్ళాం అనేదాన్ని ఒకదాన్ని ఏర్పాటు చేసుకొని దాని మెళ్ళో నగలు దిగేసే ఊహలో ఉన్నాడు." అన్నాడు సిద్దయ్య.

"ఏమండీ! మీరు కూడా ఆ కాలేజీలో జేరిపోడమో. కొత్త కాలేజీ పెట్టడమో చెయ్యరాదా!" అంది మణి తన మెడ తడుముకొంటూ.

"వద్దులే మణీ! నీ మెడ మరీ సున్నితం బరువులు మొయ్యలేదు"అన్నాడు గోపాల్రావ్, తమ బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం కలలు కనే తల్లిదండ్రుల కలలను కరిగించి బంగారు మేడలు కట్టుకోడం ఇష్టం లేక.

*- ఆంధ్రజ్యోతి, సచిత్ర వారపత్రిక, '82*

★